2న ఏకలవ్య ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - మక్కువ/సీతంపేట

మక్కువ మండలం అనసభద్ర, సీతంపేట ఐటిడిఎ పరిధిలో భామిని, మెళియాపుట్టి ఏకలవ్య పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ ఆరవ తరగతిలో ప్రవేశానికి జరగబోయే ప్రవేశ పరీక్ష మార్చి నెల 2న జరగనున్నట్లు ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు తెలిపారు. ఈ నెల 25న జరగనుందని గతంలో ప్రకటించిన ఈ పరీక్షను అధికారులు ఆ తేదీని మార్చి 2కు మార్చినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రవేశ పరీక్షకు హాజరు కాబోయే అభ్యర్థులు గమనించాలని కోరారు. అలాగే ఈనెల 19వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఇక సమరమే

- మగిసిన నామినేషన్ల ఘట్టం
- బరిలో 10మంది
- పోటీ ఆ ముగ్గురు మధ్యే
- పిడిఎఫ్ అభ్యర్థిగా కోరెడ్ల విజయగౌరి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోటీ కోసం అభ్యర్థులకు నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం గురువారం సాయంత్రంతో ముగిసింది. నామినేషన్లను దాఖలు చేసిన వారిలో ఏ ఒక్కరూ ఉపసంహరించుకోకపోవడంతో బరిలో 10 మంది అభ్యర్థులు నిలిచారు. అయితే ప్రధాన పోటీ మాత్రం ముగ్గురు అభ్యర్థుల మధ్యే ఉంటుందని తెలుస్తోంది. ఫిబ్రవరి 3 నుంచి 10వ తేదీ వరకూ నామినేషన్ల దాఖలు కార్యక్రమం విశాఖ జిల్లా కలెక్టరేట్ కేంద్రంగా జరిగింది. టీచర్ ఎమ్మెల్సీ బరిలో ఉన్న అభ్యర్థుల కోసం ఈనెల 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ పోలింగ్ జరుగనుంది. 22,493 మంది టీచరు ఓటర్లున్నారు.

పోటీ ఆ ముగ్గురి మధ్యే...

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పదిమంది పోటీలో ఉన్నప్పటికీ ప్రధానంగా పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, ప్రస్తుత ఎమ్మెల్సీ పి.రఘువర్మ, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడ మధ్యే పోటీ ఉండనుంది. యుటిఎఫ్, ఉపాధ్యాయ సంఘాలు బలపర్చిన ప్రోగ్రెసివ్ డెమక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి ఉత్తరాంధ్ర ప్రాంతంలో పలు ప్రజాతంత్ర, ఉపాధ్యాయుల సమస్యలపైనా ఉద్యమాలు చేపట్టిన మహిళగా అందరిలోనూ మంచి గుర్తింపు పొందారు. ప్రభుత్వ, ప్రయివేటు స్కూల్స్‌లో సమస్యల అధ్యయనం, ప్రభుత్వాల విధానాల వల్ల విద్యారంగానికి జరగబోయే కష్ట, నష్టాలపై పలుమార్లు ఉత్తరాంధ్ర స్థాయిలో గొంతెత్తిన చరిత్ర ఆమెకు ఉంది. రాష్ట్రంలోనే పిడిఎఫ్ అభ్యర్థులందరూ ఉద్యమాభిలాషతో ముందుకు సాగిన వారే అయినందున టీచర్ల నుంచి ఈమెకు మంచి స్పందన లభిస్తోంది. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ బరిలో పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసుల నాయుడు శాసన మండలి సభల్లో ఉపాధ్యాయుల తరపున గొంతెత్తాల్సిన వీరు పాలక పక్షాలకు భజన చేస్తూ 'ఇద్దరూ ఇద్దరే' అనేలా వ్యవహరిం చడం టీచర్లం దరి లోనూ తాజా గా చర్చ సా గు తో ంది. ప్రస్తుత ఎన్నికల్లో 'కూటమి పార్టీల మద్దతు నాకంటే నాకు అనుకుంటూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీని సైతం వీరు రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలా పోటీ పడి ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వారికి వత్తాసుగా నిలవడమే వీరి వ్యాపకంగా మారిపోయింది. జాతీయ విద్యా విధానం పేరుతో ఢిల్లీ నుంచి రాష్ట్రాల విద్యాహక్కులను, విద్యారంగాన్ని కార్పొరేటీకరణ చేస్తున్న బిజెపికి చెందిన విశాఖ నాయకుడు పివిఎన్.మాధవ్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులు నాయుడుకు మద్దతుగా నిలబడ్డారు. రాష్ట్రంలో మోడీ విధానాల అడుగులకు మడుగులొత్తుతూ విద్యా వ్యవస్థను కలుషి తం చేసేందుకు సిద్ధమైన టిడిపి తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు రఘువర్మకు మద్దతుగా నిలిచారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలఉద్యమ స్ఫూర్తితో విజయగౌరి ముందుకు సాగుతున్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఈనెల 27న నిర్వహించనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. విశాఖ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మొత్తం 10 మంది అభ్యర్థుల నుంచి 20 నామినేషన్లు స్వీకరించినట్లు చెప్పారు. పరిశీలన అనంతరం నాలుగు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పదిమంది అభ్యర్థులు బరిలో ఉన్నారని తెలిపారు. 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరు జిల్లాల్లో 123 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని మౌలిక సదుపాయాలు, సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ ఎన్నికలలో 22,493 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పురుష ఓటర్లు 13,508, మహిళా ఓటర్లు 8,985 మంది ఉన్నారని పేర్కొన్నారు. విశాఖపట్టణంలో 13, అనకాపల్లిలో 24, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11, విజయనగరంలో 29, పార్వతీపురం మన్యంలో 15, శ్రీకాకుళంలో 31 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో నలుగురు సిబ్బంది ఉంటారని, వారికి ఇప్పటికే రెండు రౌండ్ల శిక్షణ అందించినట్లు తెలిపారు. పోలింగ్‌కు 48 గంటల ముందు అనగా ఫిబ్రవరి 25 సాయంత్రం నాలుగు గంటల నుంచి ఎటువంటి ప్రచారం చేయరాదని తెలిపారు. మార్చి 3వ తేదీన ఉదయం 8 గంటల నుంచి కౌటింగ్ ప్రారంభమవుతుందని చెప్పారు. ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ బ్లాక్‌లో కౌంటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నామని, దీనికి ఎన్నికల కమిషన్ అనుమతి రావాల్సి ఉందని పేర్కొన్నారు.

నేర చరిత్ర లేనివారిని ఏజెంట్లుగా నియమించుకోవాలి

ఎటువంటి నేరచరిత్ర లేని వారిని పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకోవాలని అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారి సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉద్యోగాలు చేస్తున్న వారిని, రాజకీయ పదవులు ఉన్నవారిని నియమించుకోరాదని స్పష్టం చేశారు. ప్రచారం విషయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని, కరపత్రాలపై ప్రింటర్, పబ్లిషర్ వివరాలను పొందుపరచాలని సూచించారు. నమూనా బ్యాలెట్ పత్రాలను రూపొందించుకునేటప్పుడు నిబంధనలు పాటించాలని చెప్పారు. జాతీయ జెండా, మతం, కులాన్ని ప్రతిబింబించేలా ఎలాంటి పత్రాలను రూపొందించకూడదన్నారు. పోలింగ్ కేంద్రంలో అధికార యంత్రాంగం ఏర్పాటుచేసిన వైలెట్ కలర్ పెన్నును ఉపయోగించి ఓటరు తనకు నచ్చిన వ్యక్తికి ఎదురుగా సంబంధిత రోమన్ లేదా ఆంగ్ల నెంబరు వేయాలని సూచించారు. ఎలాంటి రాతలు రాయకూడదని, టిక్ మార్కులు పెట్టరాదని, అలా చేస్తే ఓటు చెల్లదని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలపై అభ్యర్థులు ఓటర్లకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి, ఎఆర్ఓ బిహెచ్.భవానీ శంకర్, ఎన్నికల సెల్ అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

పోటీలో ఉన్న అభ్యర్థులు వీరే...

పోటీ చేస్తున్న అభ్యర్థులు యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, పిఆర్‌టియు బలపరిచిన అభ్యర్థి, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, బహుజన సమాజ్ పార్టీ బలపరిచిన పెదపెంకి శివప్రసాద్‌తోపాటు కోసూరు రాధాకృష్ణ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, పోతల దుర్గారావు, సుంకర శ్రీనివాసరావు పోటీలో ఉన్నారు.

టెన్త్ విద్యార్థుల సామర్థ్యంపై సమాధానాలు రాబడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

విద్యార్థులతో ముఖాముఖిలో కలెక్టర్

ప్రజాశక్తి - కొమరాడ

విద్యార్థిని, విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనలు అందిస్తూ మరో వైపు ప్రతిపాదనతో ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని విక్రమపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ గురువారం సందర్శించారు. అనంతరం విద్యార్థుల ముఖాముఖి మాట్లాడి పాఠ్యాంశాలు, ఆంగ్లభాషపై ఉన్న పరిజ్ఞానాన్ని, సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులు సమాధానాలు చెప్పడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. భవిత కార్డుల్లో (విద్యార్థుల సమగ్ర విద్యా ఆరోగ్య నివేదిక) రక్తంలో హిమగ్లోబిన్ స్థాయిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కౌమార దశ బాలికలు, గర్భిణుల్లో 75 శాతం పైబడి రక్తహీనత ఉందని తెలిపారు. రక్తహీనతను అధిగమించేందుకు విద్యార్థులకు భవిత కార్డులను అందజేసి సమగ్ర ఆరోగ్య పరీక్ష వివరాలు పొందుపరుస్తున్నట్లు తెలిపారు. హిమోగ్లోబిన్ ఏడు శాతం కంటే తక్కువ ఉన్న వారికి మంచి పౌష్టికాహారం అందించేలా ఉపాధ్యాయుల దత్తత తీసుకుని నెలనెలా రక్తపరీక్షలు నిర్వహించి ఆరోగ్య మెరుగునకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎనీమియా యాక్షన్ కమిటీలో అంగన్వాడీ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు చదువు, అభ్యాసనతో పాటు ఆరోగ్యంపై అత్యంత శ్రద్ధ అవసరమని స్పష్టం చేశారు. జిల్లాను ఎనీమియా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి కృషి చేయాలని ఆదేశించారు. ఇష్టంగా చదువుపై దృష్టి కేంద్రీకరించి విజయం వైపు పయనించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు భవిత కార్డులను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న వివిధ అధికారులతో మండలంలో అమలవుతున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలు పనితీరుపై ఆరా తీశారు. హౌసింగ్ పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖ , నీటిపారుదల శాఖ ఆర్డబ్ల్యూఎస్, ఉపాధి హామీ పథకం, వెటర్నరీ, ఇలా అన్ని శాఖల వారీగా జరుగుతున్న పనుల తీరుపై ఆరా తీశారు. రెవెన్యూ శాఖలో ముఖ్యంగా రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రీ సర్వేలో జరిగిన తప్పిదాలు, రీసర్వే పూర్తయిందా లేదా అన్న వివరాలు తహశీల్దార్ శివయ్యను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న రైతులు రీ సర్వే పూర్తయిన ప్పటికీ తమకి ఆన్లైన్లో భూమి చూపించడం లేదని తెలపడంతో ఈ సమస్యల్ని పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఇఒ ఎన్.తిరుపతినాయుడు, ఎంపిడిఒ మల్లికార్జునరావు, ఎంఇఒ తిరుపతి, వ్యవసాయశాఖ ఎఒ శంకర్రావు, హౌసింగ్ ఎఇ రాములు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గౌర్నాయుడు, రాజేంద్ర, వెటర్నరీ డాక్టర్ సత్యనారాయణ, సిడిఎస్‌పిఒ సుగుణ వివిధ మండల అధికారులతో పాటు హెచ్ఎం వెంకట నాయుడు, మెడికల్ ఆఫీసర్ శిరీష, ఉపాధ్యాయులు, తదితరులు, పాల్గొన్నారు.

గిరిజనుల్లో విషం నింపుతున్న వైసిపి

మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరురూరల్

గిరిజనుల్లో వైసిపి నాయకులు విషం నింపుతున్నారని, వారి మోసపూరిత మాటలను గిరిజనులు నమ్మొద్దని, 1/70 చట్టానికి ఎటువంటి ఇబ్బంది జరగదని సాక్ష్యాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే చెప్పారని, దీన్ని అంతా గౌరవించాల్సిన బాధ్యత ఉందని గిరిజన, స్త్రీ సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. గిరిజన నియోజకవర్గాల్లో దారుణంగా ఓడిపోవడంతో వారిలో ఎలాగైనా విషం నింపాలని వైసిపి నాయకులు గిరిజనుల మధ్య లేనిపోని అపోహలను సృష్టించి లబ్ధిపొందాలని చూస్తున్నారని విమర్శించారు. గతంలో వైసిపి అధికారంలో ఉన్నప్పుడు గిరిజనులకు రావాల్సిన 18 రకాల పథకాలను ఎందుకు ఇవ్వకుండా చేశారని ఆమె ప్రశ్నించారు. ఏజెన్సీలో గంజాయిని పూర్తిగా నిర్మూలనకు ఆ ప్రాంతాల్లో కాఫీ తోటల సాగుకు గిరిజన యువతకు శిక్షణ ఇచ్చి సాగుచేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. అలాగే తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసులు పెడతామని హెచ్చరించారు. ఒడిశా అధికారులు, పోలీసుల అక్రమాలు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని, ఇప్పుడు అటువంటి పరిస్థితుల్లేవని, దీని గురించి సిఎంకు తెలియజేశానని తెలిపారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి ఒడిశా ముఖ్యమంత్రితో మాట్లాడుతానని ఈ సమస్యను వీలైనంత తొందరలో పరిష్కరిద్దామని హామీ ఇచ్చారని తెలిపారు. రాజధానికి వెళ్లి క్యాబినెట్ సమావేశాల్లో పాల్గొంటున్నానని, అంతే తప్ప మీకు లాగా కార్యకర్తలు సమస్యలు చెప్పుకోవడానికి వస్తే ఏ ఒక్కరికీ సమయం ఇవ్వకుండా వెనక్కి పంపలేదని ఇలా చేయనందుకేనా తనను అహంకారపూరితంగా మాట్లాడుతున్నానని అంటున్నారని ఆమె రాజన్నదొరను ప్రశ్నించారు. తాను ఎవరి పైనా అక్రమ కేసులు, పరుష పదజాలంతో మాట్లాడలేదన్నారు. సాలూరు ప్రాంతాన్ని అభివృద్ధే తన ధ్యేయమన్నారు.

ఉపాధి వేతన దారుల సంఖ్య పెంచాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉపాధి హామీ పనుల్లో వేతనదారుల సంఖ్యను పెంచాలని ఎంపిడిఒలను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. గురువారం ఆయన ఎంపిడిఒలు, ఉపాధిహామీ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో వేతనదారుల సంఖ్య పెంచాలని, వారికి వచ్చే కనీస వేతనం రూ.300 వరకు పెరిగేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఇందుకు తగిన మార్కింగ్ ఇవ్వాలన్నారు. 100 పని దినాలు ఎక్కువ కుటుంబాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని, గత ఏడాది కంటే ఈ ఏడాది వంద రోజుల పని దినాలు పూర్తిచేసిన కుటుంబాలు కనీసం రూ.55 వేలు ఉండాలని అన్నారు. మండలాల్లో సూర్య ఘర్ కార్యక్రమం కింద ఎక్కువ మంది వినియోగదారులు చేరేలా కృషి చేయాలని, రక్తహీనత కార్యక్రమాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షించాలని, ఎంఎస్ఎంఇ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లోనూ, అంగన్వాడీ కేంద్రాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం కూడా వేగవంతం కావాలని చెప్పారు. మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలంతా భాగస్వామ్యం కావాలన్నారు. బలిజిపేట మండలం పెద పెంకిలో కాలువల శుభ్రత సంతృప్తికరంగా లేదని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ కె.హేమలత, డ్వామా పీడీ కె.రామ చంద్రరావు పాల్గొన్నారు.

బ్రెయిన్ హెల్త్ ఇనిషియేటివ్ ప్రోగ్రామ్‌కు జిల్లా ఎంపిక

బ్రెయిన్ హెల్త్ ఇనిషియేటివ్ ప్రోగ్రామ్‌కు జిల్లా ఎంపిక అయింది. ఈ మేరకు నీతి ఆయోగ్ నేతృత్వంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ బిహేవియర్ అండ్ అల్లైడ్ సైన్సెస్ అదనపు కార్యదర్శి, మిషన్ డైరెక్టర్ గీతాంజలి గుప్తా, సంచాలకులు ప్రొఫెసర్ రాజేందర్ కె దమిజ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో బ్రెయిన్ హెల్త్ ఇనిషియేటివ్ ప్రోగ్రామ్‌కు జిల్లా ఎంపికైనట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 16 ప్రాంతాల్లో మాత్రమే ప్రారంభించనున్న ఈ ప్రయోగాత్మక ప్రాజెక్ట్‌లో జిల్లా ఎంపిక కావడం గర్వకారణం. ఈ సందర్భంగా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ బ్రెయిన్ హెల్త్ ఇనిషియేటివ్ ప్రోగ్రామ్ ను డిస్ట్రిక్ట్ హాస్పిటల్ వద్ద బ్రెయిన్ హెల్త్ క్లినిక్ ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కుష్టు, ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ వినోద్ కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వాగ్దేవి పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ పల్లెనిద్ర

కురుపాం : పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను గురువారం రాత్రి కలెక్టర్ ఎ. శ్యాం ప్రసాద్ సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో విద్యార్థులకు కొన్ని మౌలిక ప్రశ్నలను వేసి వారి యొక్క విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం 10 వ తరగతి విద్యార్థులకు గణితం పై కొన్ని మౌలిక విద్యార్థులకు వేశారు. పబ్లిక్ పరీక్షలకు దగ్గర పడుతున్న నేపథ్యంలో కష్టపడి చదివి శత శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. విద్యార్థులకు అందుతున్నటువంటి భోజనం, ఆరోగ్య రికార్డులను పరిశీలించి, మౌలిక వసతులు గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో పల్లె నిద్ర చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జె. ఉమామహేశ్వరి , తహశీల్దార్ ఎం .రవణమ్మ, ఇఒపి ఆర్‌డి రమేష్ బాబు , ఎటిడబ్ల్యుఒ కె.చంద్రబాబు, పాఠశాల హెచ్ఎం రామ గోవిందం, వార్డెన్ సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ శ్రీవాస్తవ

ఫిర్యాదుల పరిష్కార నాణ్యతను పరిశీలించిన పిఒ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదుల పరిష్కార నాణ్యతను సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కార నాణ్యతలో ఎటువంటి లోటుపాట్లు ఉండరాదని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుండి అందిన అర్జీలు పక్కాగా విచారణ చేయాలన్నారు. అవసరమైతే అర్జీదారుతో నేరుగా మాట్లాడి సమస్య తెలుసుకుని త్వరగా పరిష్కారం చేయాలన్నారు. అర్జీదారుని సంతృప్తి మేరకు పరిష్కారం కావాలన్నారు. ఎండార్స్ మెంటు జరిగితే కారణాలు స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. అనంతరం లచ్చయ్యపేటలో జరుగుతున్న రీ సర్వేను పరిశీలించారు. రీ సర్వేలో చేపడుతున్న ప్రక్రియను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీసర్వే రికార్డుల క్షుణ్ణంగా పరిశీలించారు. రీ సర్వే చేయడం వల్ల భూమి ప్రస్తుత పరిస్థితిని, సరిహద్దులను నిర్ధారించవచ్చని తెలిపారు. గ్రౌండ్ ట్రూథింగ్ పక్కాగా జరగాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్న కుమార్, ఉప తహసీల్దార్ ఎ.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకొంటూ వినూత్నంగా నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

పూర్ణపాడు వంతెన పనులు పూర్తి చేయాలని

సిపిఎం ఆధ్వర్యాన వినూత్న నిరసన

ప్రజాశక్తి - కొమరాడ

దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న పూర్ణపాడు- లాబేసు వంతెన పెండింగ్ పనులు పూర్తి చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో గురువారం వంతెన వద్ద మేడకు ఉరితాలు కట్టుకొని వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఈ సంద్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ నాగావళి నదిలో పూర్తిగా నీరు తగ్గిన వేళ వంతెన పనులు వెంటనే ప్రారంభించి 45గిరిజన గ్రామాల ప్రజలకు భరోసా కల్పించలేరా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ వంతెన పనులు పూర్తి చేస్తామని చెప్పి నేటి ఆరు నెలలు గడిచినా వంతెన వద్దకు ఒక అధికారి గానీ, కాంట్రాక్ట్ గానీ రాకపోవడం చూస్తుంటే ఈ వంతెన ఈ ఏడాది కూడా పూర్తికాని పరిస్థితి నెలకొందని అన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి వంతెన పనులు పూర్తి చేసి అటు 45 గిరిజన ప్రజలకు భరోసా కల్పించాలని కోరారు. లేకుంటే ఇంకా ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రామారావు, వెంకటేష్, బోడియయ్య, రైతు సంఘం నాయకులు ఉపేంద్ర, కెవిపిఎస్ నాయకులు ప్రసాదు, లాబేసు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇద్దరు పంచాయతీరాజ్ ఎఇ లు సస్పెన్షన్

పార్వతీపురం : విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం, పనుల్లో ప్రగతి లేకపోవడంతో ఇద్దరు పంచాయతీరాజ్ ఎఇలను సస్పెన్షన్ చేస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. జిల్లాలో జరుగుతున్న వివిధ ఇంజనీరింగ్ పనులపై గురువారం ఆయన సమీక్షించారు. గత మూడు నెలలుగా గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో ఎటువంటి ప్రగతి కనిపించలేదని గమనించిన కలెక్టర్ అక్కడి సహాయ ఇంజినీర్లను సస్పెన్షన్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రగతిలో జాప్యం పట్ల తీవ్రంగా పరిగణించిన ఆయన ఆయా ప్రాంతాల ఇంజనీర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారిని ఆదేశించారు. పల్లె పండుగ కార్యక్రమం కింద 572 పనులు మంజూరు చేయగా కేవలం 19 శాతం మాత్రమే పనులు జరగడం పట్ల ఇంజనీరింగ్ అధికారుల పని తీరును కలెక్టర్ ప్రశ్నించారు. అవసరమైతే డిఇలను, ఇతర సిబ్బందిని బదిలీలు, మార్పులు చేర్పులు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి పని వల్ల వందలాది మందికి మేలు జరుగుతుందని గుర్తించాలని, అందుకు అనుగుణంగా పనులు పూర్తి చేయడంలో ఆనందాన్ని చవిచూడాలని ఆయన ఉద్బోధించారు. సమావేశంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి బి.చంద్ర శేఖర్, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారి పి.రమాదేవి, ఇంజనీరింగ్ సలహాదారు ఎంవిఆర్ కృష్ణాజీ, పలువురు డిఇలు పాల్గొన్నారు.

గుడ్లు, మాంసంపై అపోహలొద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం

కోడిగుడ్లు, మాంసంపై అపోహలు వద్దని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శివ్వాల మన్మథరావు తెలిపారు. రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాధిని గోదావరి జిల్లాలోని కోళ్లలో నిర్ధారించడం దృష్ట్యా జిల్లాలోని పశు సంవర్ధక శాఖ ముందస్తు చర్యగా జిల్లాలో స్థానిక పశువైద్యాధికారులతో తనిఖీ నిర్వహించగా, ఇప్పటి వరకు జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాధి లేదని నిర్ధారణ జరిగిందని చెప్పారు. ఈ మేరకు మన్మథరావు గురువారం పలు ప్రాంతాల్లో సందర్శించారు. జిల్లాలో కోళ్లలో ఎటువంటి అసాధారణ మరణాలు నమోదు కాలేదని నిర్ధారించినట్టు తెలిపారు. ముందస్తు వ్యాధి నిరోధక చర్యల్లో భాగంగా జిల్లాలోని కోళ్ల రైతులకు తగు నివారణ చర్యలను చేపట్టి వ్యాధి వ్యాపించకుండా జాగ్రత్త వహించాలని సూచించినట్లు ఆయన చెప్పారు. కోడి మాంసం, గుడ్లు వినియోగించేవారు ఎటువంటి అపోహలు అవసరం లేదని స్పష్టం చేశారు. కోడి గుడ్లు, మాంసాలను బాగా ఉడికించి వినియోగించడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినట్లు ఏ సంస్థలు, శాఖలు ధృవీకరించలేదని పేర్కొన్నారు. బర్డ్ ఫ్లూ వ్యాధి గురించి ఎటువంటి అపోహలు, ఆందోళనలను నివృత్తి చేయడానికి పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు 17 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. పొరుగు రాష్ట్రాల నుండి మన జిల్లాలోకి వ్యాధి సోకిన కోళ్ళ రవాణా జరగకుండా జిల్లా లో 5 చెక్ పోస్ట్ లలో సిబ్బంది ని నియమించినట్లు ఆయన చెప్పారు. బర్డ్ ఫ్లూ వ్యాధి నివారణ చర్యల నిమిత్తం మరిన్ని వివరాలకుస్థానిక పశు వైద్యాధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

సాలూరులో ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరిని గెలిపించండి

ప్రజాశక్తి - సాలూరు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని కోరుతూ గురువారం యుటిఎఫ్ నాయకులు సాలూరు పట్టణం, పాచిపెంట మండలాల్లో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి విజయంగౌరితో పాటు యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.విజయకుమార్, మండల నాయకులు కె.జానకీరావు, సీతయ్య, సింహాచలం, రాజమణి, పట్టణ నాయకులు శ్యాం పట్టణంలోని గాడివీధి మున్సిపల్ హైస్కూల్, డబ్బివీధి మున్సిపల్ హైస్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, పాచిపెంట మండలం పి.కోనవలస గిరిజన సంక్షేమ గురుకుల బాలుర, బాలికల పాఠశాలలు, కళాశాలలో ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిశారు. ప్రభుత్వ రంగంలో విద్యావ్యవస్థ బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు చేసిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయ గౌరిని గెలిపించాలని కోరారు.

వీరఘట్టం : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని కోరుతూ గురువారం యుటిఎఫ్ నాయకులు మండల కేంద్రంలో ఇంటింట ప్రచారం చేపట్టారు. విజయగౌరికి మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎం పైడిరాజు, బి దుర్గాప్రసాద్, కే గోవిందరావు, గౌర్నాయుడు, ఎస్ గణేష్, ఏ చంద్రమోహన్, వి అన్న జీ రావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పశువుల సంతను సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ శివారులో ఉన్న మార్కెట్ యార్డులో జరుగుతున్న పశువుల సంతను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ గురువారం సందర్శించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. పశువులు, జీవాల క్రయ విక్రయాలు, వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డులో తాగు నీటి సౌకర్యం, మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలని జిల్లా మార్కెటింగ్ అధికారి ఎల్.అశోక్ కుమార్‌ను ఆదేశించారు. పశువులను కబేలాలకు తరలించేందుకు అక్రమ రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేయడంతో పాటు చట్టపరంగా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. మార్కెట్లో కల్తీ, నకిలీ వస్తువుల అమ్మకాలు జోరుగా సాగుతున్నట్లు సమాచారం ఉందని, అరికట్టేందుకు సంబంధిత అధికారులతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వ్యక్తులను ఉపేక్షించేది లేదన్నారు. మార్కెట్‌లో లభిస్తున్న నకిలీ వస్తువుల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

ఏనుగు ధ్వంసం చేసిన ధాన్యం బస్తాలు

ఏనుగులు దాడిలో ధాన్యం బస్తాలు ధ్వంసం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెద్దింపేటలో రైతులు నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలను ఏనుగులు ధ్వంసం చేయడంతో బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెన్నెల వేణు, ఎన్ సాంబమూర్తి మాట్లాడుతూ పెద్దింపేటలో రాత్రి 12 గంటల సమయంలో ఏనుగులు కళ్లాల్లో ఉన్న ధాన్యపు బస్తాలను ధ్వంసం చేశాయన్నారు. ఇందులో మజ్జి దుర్గారావువి 65 బస్తాలు, మాచర్ల వెంకట నాయుడువి 35 బస్తాలు ఉన్నాయన్నారు. అలాగే ఒక జెసిబి, ఇతర సామాగ్రిని కూడా ధ్వంసం చేశాయన్నారు. కావున అటవీశాఖ అధికారులు పంట నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

ఎల్విన్ పేటలో రహదారి భద్రత మహోత్సవాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్ ఆవరణలో రవాణా, పోలీసుశాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు కార్యక్రమం గురువారం నిర్వహించారు. జిల్లా మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ట్రాక్టర్లు, జీపులు, ఆటోల యజమానులకు, డ్రైవర్లకు రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. వాహనాలకు ఇన్సూరెన్స్ అప్డేట్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై బిడ్డిక శివప్రసాద్ ఉన్నారు.

20న వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - మక్కువ

ఈనెల 20న పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎస్ఐ ఎం.వెంకటరమణ తెలిపారు. మండలంలోని ఎర్రసామంతవలసలో జరుగు టోర్నమెంటులో పాల్గొనదలిచే వాలీబాల్ టీములు ఆయా సచివాలయాల మహిళా పోలీసుల వద్ద అలాగే స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆయా జట్ల పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ టోర్నమెంట్ గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేయబడుతుందన్నారు. కావున వాలీబాల్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

పెద్దూరులో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురం సచివాలయం పరిధి పెద్దూరులో గురువారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, మధుమేహ, జ్వర పీడితులు, రక్తపోటు తదితర వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు డిప్యూటీ సిఎం పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ సర్పంచ్ ఎ.మన్మధరావు తల్లి ఇటీవల మృతి చెందిన సంఘటన తెలుసుకున్న మాజీ డిప్యూటీ సిఎం పాములు పుష్పశ్రీవాణి గురువారం ఆయన ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించి ఓదార్చారు. అలాగే జి.సివడకు చెందిన వైసిపి కార్యకర్త నిమ్మల లక్ష్మణరావు తల్లి మృతి చెందిన సంఘటన తెలుసుకొని ఆయన ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, మాజీ ఎంపిపి ఆనిమ ఇంద్రకుమారి, ఎఎంసి మాజీ చైర్మన్ ఎన్ వెంకటరావు, వైస్ ఎంపిపి రంగారావు, ఎంపిటిసి సభ్యులు జి.విద్యారాణి, వైసిపి నాయకులు నూరెళ్ల, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వల్లభనేని అరెస్టును ఖండించిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రాష్ట్రంలో తీవ్ర అధికార దుర్వినియోగం రెడ్ బుక్ రాజ్యంలో రాజ్యాంగ వ్యవస్థలు సమాధి అవుతున్నాయని, వల్లభనేని వంశీ అరెస్టు అందుకు నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్టును ఆయన తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాజ్యాంగం అపహాస్యం అవుతోందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు. రాజ్యాంగ వ్యవస్థలు, న్యాయ వ్యవస్థలను అపహాస్యం చేస్తోందని, చట్టం అంటే గౌరవం లేదని విమర్శించారు. ఆ చట్టాన్ని కాపాడే న్యాయ వ్యవస్థలపై కూడా గౌరవం లేకుండా వ్యవహరిస్తోందన్నారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే అరెస్టు కూడా దీంట్లో భాగమే అన్నారు.

ఎస్‌డబ్ల్యుపిసిని సందర్శించిన ఇఒపిఆర్‌డి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బూర్జ కృష్ణరాయిపురంలో ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాలను ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రాప్ మిత్రులు చెత్త సేకరించిన అనంతరం ఈ కేంద్రాల్లో తడి, పొడి చెత్త వేరు చేసి దాన్ని గతం తయారు చేసి వచ్చే దాన్ని ఆర్థిక వనరుగా ఉంచుకోవాలని అన్నారు. క్రాప్ మిత్రులకు కొన్ని సూచనలు చేశారు. కార్యక్రమంలో గుజ్జుల దాసు, జి.అన్నంనాయుడు, పంచాయతీ కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, ఎన్.శ్రీను ఉన్నారు.

వైసిపి మండల కన్వీనర్‌గా ద్వారపురెడ్డి

ప్రజాశక్తి -కొమరాడ

మండల వైసిపి కన్వీనర్ గా ద్వారపురెడ్డి జనార్దనరావును నియమించారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. తనపై నమ్మకంతో మూడోసారి మండల వైసిపికన్వీనర్‌గా అవకాశం ఇచ్చిన జిల్లా అధ్యక్షులు పరీక్షిత్‌రాజ్‌కు మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. తనకు మూడోసారి పార్టీ ఇచ్చిన బాధ్యతలను పార్టీ కోసం కష్టపడి పనిచేస్తానన్నారు. ప్రతి గ్రామంలోనూ వైసిపి బలోపేతానికి సైనికులను తయారు చేసి వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జనార్ధన్‌ను ఎంపిపి శెట్టి శ్యామల, జడ్పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు అభినందించారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

అటవీ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీల ఊచకోతకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని వామపక్షాలు ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం పట్టణంలోని కళాసీ సంఘం ఆఫీసులో నిరసన సభ జరిగింది. ఈ సమావేశంలో పలు వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. దేశంలోని విశాల అటవీ ప్రాంతాల్ని, అడవిలోని విలువైన ఖనిజ సంపదను బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకే ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని, మావోయిస్టుల ఏరివేత పేరుతో తీవ్ర నిర్బంధం ప్రయోగించి ఆదివాసీలపై సైనిక బలగాలను ఉపయోగించి ప్రత్యక్ష యుద్ధం సాగిస్తుందని విమర్శించారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన రక్షణలన్నీ రద్దుచేస్తూ వారి జీవనాన్ని దెబ్బతీస్తూ వారిని పూర్తిగా అడవుల నుంచి తరిమివేయడానికి సిద్ధమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలపై సాగిస్తున్న మారణహోమాన్ని ఆపివేయాలని, ఆపరేషన్ కగార్‌ను రద్దుచేయాలని వక్తలు డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు వెంటనే జోక్యం చేసుకొని ఆపరేషన్ కగార్‌ను ఆపివేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలనీ, ఇంతవరకూ జరిగిన ఎన్ కౌంటర్ ఘటనలపై న్యాయవిచారణ జరపాలని, ఆదివాసీల రాజ్యాంగపర రక్షణలు, హక్కులను కాపాడాలనీ కోరారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు బొత్స నర్సింగరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎం.గోపాలం (సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, బివి రమణ (సిపిఎం, టి.జీవ (సిపిఐ), పి.భాస్కరరావు (సి.పి.ఐ (ఎం.ఎల్) లిబరేషన్, రంజిత్ కుమార్ (గిరిజన సంక్షేమ సంఘం), పి.రమణి (ప్రగతిశీల మహిళా సంఘం), శంబుడు జయలక్ష్మి (అఖిల భారత ఆదివాసీ వేదిక), పి.లక్ష్మణరావు (అఖిల భారత రైతు కూలీ సంఘం), పువ్వాల ప్రసాద్ (గిరిజన సమాఖ్య) తదితరులు ప్రసంగించారు.

సభలో మాట్లాడుతున్న నర్సింగరావు

గిరిజన సర్పంచులపై వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని గిరిజన పంచాయితీలైన రావికోన, ఆడారు, వెలగవలస, డికె పట్నం పంచాయితీ సర్పంచులపై స్థానిక టిడిపి నాయకుల ఒత్తిడితో అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ మేరకు గురువారం రావికోన సర్పంచ్ కద్రక రామస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రావికోన పంచాయితీ పరిధిలో అడ్డూరువలస విఒఎను నియమించాలని అధికారులను కోరుతున్నామని, ఈ మేరకు కలెక్టర్, జెసిను కలిసి వినతులు కూడా అందించామని తెలిపారు. అయితే ఈ విషయం గిట్టని మండల టిడిపి నాయకులు, పంచాయితీ రికార్డుల వెరిఫికేషన్ పేరుతో ఆయా గ్రామాల సర్పంచులపై డిఎల్‌పిఒ ద్వారా ఒత్తిడి తీసుకొస్తున్నారని అన్నారు. రావికోన పంచాయితీలో పనిచేసిన పాత సెక్రెటరీ లావణ్య ఉండేటప్పుడు కూడా ఇదే ప్రయత్నం చేశారని, అప్పుడు కూడా వెనక్కి తగ్గకపోవడంతో కొత్తగా వచ్చిన సెక్రెటరీ భయాందోళనకు గురి చేస్తున్నారని, డిఎల్‌పిఒ చేత ఫోన్ చేయించి బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కావున భవిష్యత్తులో ఎటువంటి పరిణామాలు జరిగిన వీళ్లిద్దరితే బాధ్యతని తెలియపరుస్తున్నామని, అలాగే పార్వతీపురం మండలంలో గిరిజన పంచాయతీని సర్పంచులకు సంబంధం లేకుండా కాంపౌండ్ వాల్స్, అధికార పార్టీకి అధికారులు ఇచ్చి పనులు చేపడుతున్నారు. గత ఎన్నికల సందర్భాల్లో టిడిపి తాము అధికారంలోకి వస్తే సర్వహక్కులు సర్పంచులకు చెప్పారని, ఇప్పుడు కనీసం పంచాయతీలకు ప్రధాన పౌరులుగా ఉన్న సర్పంచులకు సంబంధం లేకుండా ఎలా పని చేస్తు న్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో వెలగ వలస, ఆడారు, పెద్దమరికి సర్పంచులు మెలిక దాలమ్మ, తోడంగి దిబ్బన్న, ఇమ్మడి గంగ పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య

ప్రజాశక్తి - కొమరాడ

భూమి ఉన్న ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రభుత్వం అందజేస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.శంకరరావు అన్నారు. మండలంలోని విక్రాంపురం సచివాలయంలో గురువారం జరుగుతున్న విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకొని రావటం ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. రైతు గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసిన తర్వాత భూమి గల ప్రతి రైతుకు కేటాయించబడే ప్రత్యేక గుర్తింపు సంఖ్య అని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందన్నారు. పథకాలు నేరుగా పొందే వీలు కలుగుతుందని అన్నారు.

రీసర్వే వేగవంతం

ప్రజాశక్తి - భామిని

మండలంలో రీసర్వే పనులు వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలంలోని మనిగలో చేపడుతున్న రీ సర్వే పైలట్ విలేజ్‌ని క్షేత్ర స్థాయిలో గురువారం ఆయన పరిశీలించారు. పైలట్ విలేజ్ రీసర్వే ప్రారంభమై రోజులు గడుస్తున్నా సర్వే వేగంతో చేయడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకొని, సర్వే వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మనిగ పంచాయతీ పరిధిలో 297 ఎకరాలు, 145 సబ్ డివిజన్లు గాను 160 ఎకరాల్లో సర్వే పూర్తి చేస్తామని, 167 మంది రైతుల ఉన్నట్లు తెలిపారు. మనిగ పంచాయతీలో కొన్ని భూములు క్రయ, విక్రయలు జరిగాయని, రీ సర్వేలో వాటిని పరిగణలోకి తీసుకోవాలని కొంతమంది రైతులు సబ్ కలెక్టర్ దష్టికి తీసుకెళ్లారు. వాటికి సంబంధించిన డాక్యుమెంట్లు ఉంటే కచ్చితంగా పరిగణలోకి తీసుకుంటామని సబ్ కలెక్టర్ అన్నారు. అనంతరం భామిని తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు గ్రీవెన్స్ పరిష్కారంపై, రీ సర్వే వేగవంతంపై రెవెన్యూ అధికారులు, రెవెన్యూ సర్వేలతో సమీక్ష నిర్వహించారు. భూ సంబంధించిన సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు పెట్టారని, వాటిని పరిష్కారం చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం బాలేరు పిహెచ్‌సిని పరిశీలించి, రోగులకు అందుతున్న సేవలు ఆరా తీశారు. పిహెచ్‌సి రికార్డులు తనిఖీ చేసి, పరిసరాలు, శానిటేషన్‌ను పరిశీలించారు. ఆసుపత్రిలో బయో వ్యర్థాలు లేకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.అప్పారావు, సర్వేయర్ రాజేష్, సర్వేయర్ డిటి రమేష్, వైద్యులు శివకుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రైతులను సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

మంత్రికి వినతిని అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - సాలూరురూరల్

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత నెలలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన గ్రీవెన్స్ సందర్భంగా మంత్రి సంధ్యారాణికి తమ సమస్యలను విన్నవించామని, కానీ నేటి వరకు అవి అమలు కాలేదని మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు శంకరరావు, రాముడు తెలిపారు. ఈ మేరకు గురువారం మంత్రి సంధ్యారాణిని కలిసి మున్సిపల్ కార్మికులు వినతిపత్రం ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రస్తావిస్తే మంత్రి వెంటనే వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని కానీ నేటి వరకు కూడా ఆ హామీ అమలు కాలేదని అన్నారు. జనవరికి సంబంధించిన జీతాలు నేటి వరకు జమ కాలేదని ఫిబ్రవరి నెల బడ్జెట్ లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారని అన్నారు. చనిపోయిన కార్మిక కుటుంబాల పిల్లలకు ఉద్యోగాలను కల్పించలేదని, మున్సిపల్ కార్మికులకు ఇవ్వాల్సిన కనీస అవసరాలైన సబ్బులు నూనెలు, చెప్పులు కూడా సరఫరా చేయకుండా చేస్తున్నారని ఇలా అయితే కార్మికులు ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. కార్మిక కుటుంబాలు ఆకలి బాధలతో ఉంటున్నారని, వీటన్నింటిని చూసి లు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే కార్మికుల అందరితో కలిసి పోరాటాలు చేస్తామని, దీనికి పాలకవర్గం మున్సిపల్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ ప్రసన్నకుమార్

టెన్త్‌లో శత శాతానికి కృషి : డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఈ ఏడాది పదో తరగతిలో శత శాతం సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఐటిడిఎ ఉప విద్యాశాఖ అధికారి కంభం రవి ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల సామర్థ్యం తెలుసుకున్నారు. పరీక్షలు దగ్గర పడ్డాయని, కావున ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తీర్ణత తప్పనిసరిగా వరిస్తుందని అన్నారు. విద్యార్థులకు కొన్ని మేలుకువలు, టిప్స్ చెప్పారు. 91 మందికి 91 మంది ఉత్తీర్ణత చెందాలని ఆకాంక్షించారు. ఇప్పటి నుంచే కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు అధిరోహించవచ్చని అన్నారు. ఈ క్యాంపలో 599 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. క్యాంపస్ నిర్వహణ ఆహ్లాదకర వాతావరణం ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఆయనతో పాటు ప్రధానోపాధ్యాయులు బి ఉమావాణి, డిప్యూటీ వార్డెన్ ఎస్ మల్లి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాతో వారపు సంత పర్యవేక్షణ

ప్రజాశక్తి - కురుపాం

గురువారం జరిగిన కురుపాం వారపు సంతలో స్థానిక ఎస్సై పి.నారాయణరావు డ్రోన్ కెమెరాను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతల్లో జరుగుతున్న పరిణామాలు, గ్రామాల్లో, తోటల్లో ఇరుకైన ప్రదేశాల్లో జరిగే నేరాలను డ్రోన్ ద్వారా తెలుసుకోవచ్చునని, సాంకేతిక టెక్నాలజీ రావడం వల్ల రానున్న రోజుల్లో పోలీసు వ్యవస్థకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుకు వ్యతిరేకంగా 'ఈగల్' టీమ్‌లు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో గల ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా పాఠశాల హెచ్ఎం, కళాశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి 8 మంది సభ్యులతో ఈగల్ టీంలు ఏర్పాటు చేసినట్లు టౌన్ సిఐ బి.అప్పలనాయుడు చెప్పారు. గురువారం ఆయన ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించి ఈగల్ టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒకవేళ ఎవరైనా విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడినట్లు తెలిస్తే వారికి తగిన కౌన్సిలింగ్ ఇచ్చి పరివర్తన తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

2500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం చినమేరంగి పోలీస్ స్టేషన్ పరిధిలో చినమేరంగి రెల్లి వీధిలో నాటుసారా స్థావరాలపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటుసారా తయారీకి ఉంచిన 2500 లీటర్ల బెల్లం ఊట, 25ప్లాస్టిక్ డ్రమ్ములు డ్రమ్ములను స్వాధీనం చేసుకుని కాల్చి వేసినట్లు ఎస్ఐ అనీష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.బి, క్యాట్ పార్టీ పోలీస్ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

సీతంపేట: మండలంలోని పులిగుమ్మి కొండ ప్రాంతంలో 540 బెల్లం ఊటలను నేలమట్టం చేస్తున్న ఎస్ఐ వై.అమ్మన్నరావు గురువారం తెలిపారు. డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు ఈ కార్యక్ర మంలో పోలీసులు తదితరులు ఉన్నారు.

అంగన్వాడీ భవనాల నిర్మాణానికి స్థలం అప్పగింత

పార్వతీపురం రూరల్ : మండలంలోని నర్సిపురంలో అంగన్వాడీ కేంద్రాలకు భవన నిర్మాణాల నిమిత్తం స్థలం కోసం సిడిపిఒ శ్రీనివాసరావు అభ్యర్థన మేరకు తహశీల్దారు జయలక్ష్మి గ్రామంలోని ప్రభుత్వ స్థలం సర్వేనెంబర్ 375/1 లో కొంత భాగాన్ని కేటాయించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కె.రూపేష్ మాట్లాడుతూ మండలంలోని అంగన్వాడీ కేంద్రాలకు అదనపు భవనాలు నిర్మాణం, మరుగుదొడ్ల ఏర్పాటుకు స్థలాలు సేకరిస్తున్నామని, అందుకు ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను కేటాయింపునకు రెవెన్యూ అధికారుల సహకారాన్ని తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామచంద్రరావు, సర్వేయర్లు, విఆర్ఒలు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ప్రత్యేకాధికారి

సాలూరురూరల్ : మండలంలో తోనం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను గురువారం సాయంత్రం మండల ప్రత్యేక అధికారి వై సత్యమనాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు మరి కొద్ది రోజుల్లో జరుగుతున్నాయని దీనికోసం ప్రతి ఒక్క విద్యార్థి శ్రద్ధగా చదువుపై దృష్టి పెట్టి మంచి మార్కులు సాధించుటకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం వసతి గృహాన్ని సందర్శించి వంటశాలను పరిశీలించారు. హాస్టల్‌లో అందుతున్న వసతుల గురించి హాస్టల్ వార్డెన్ అంబటి లచ్చయ్యతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి మెనూ ప్రకారము ఆహారము అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రాత్రి బస కూడా వసతి గృహంలోనే ఉంటున్నట్లు ఆయన తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఎపిఎస్ఐఆర్ డిపిఆర్ పంచాయతీరాజ్ శాఖ పీసా చట్టంపై మండల స్థాయిలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 నుంచి 21 వరకు పీసా చట్టంపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి తప్పని సరిగా హాజరు కావాలని తెలిపారు. ఎంపిడిఒ కె.గీతాంజలి మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాప్తికి ప్రజాప్రతినిధులు, ఎస్‌హెచ్‌జి సభ్యులు, సచివాలయం సిబ్బంది హాజరు కావాలని కోరారు. పీసా చట్టం ఫారెస్ట్ రైట్స్ చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, జడ్పీటీసీ సవర లక్ష్మి, పలువురు ఎంపిటిసి సభ్యులు, 41 షెడ్యూల్ గ్రామపంచాయతీ సర్పంచులు, వార్డ్ సభ్యులు హాజరు అయ్యారు. ఎపిఎస్ఐఆర్‌డి నుంచి శిక్షణ పర్యవేక్షకులు హనుమంతరావు, డిటిఎం లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు బీమా తప్పనిసరి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వాహనాలకు ఇన్సూరెన్స్ చేయాలని ఇంధన శకట తనిఖీదారు ఎం.శశికుమార్ అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా పట్టణ శివారులో ఉన్న రవాణా శాఖ కార్యాలయంలో వాహన షోరూం డీలర్స్, ఇన్సురెన్సు సర్వేయర్స్, వివిధ వాహనాల యూనియన్లతో వాహనాలకు ఇన్సూరెన్సు ఆవశ్యకత, రోడ్ ప్రమాదాలు జరిగినప్పుడు దాని వల్ల కలిగే ప్రయోజనాలను గురువారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం వాహన్ సాఫ్ట్ వేర్‌లో ఇన్సూరెన్స్ డేటా దేశంలో ఎక్కడ నుంచైనా వీక్షించవచ్చని, దీనివల్ల సత్వరంగా బాధితులకు క్లెయిమ్‌లు వస్తుందని ఆయన వివరించారు. వాహన షోరూం డీలర్లకు, వాహన కొనుగోలుదారులకు రహదారి నిబంధనలు పాటించకపోవడం వల్ల కలిగే దుష్ఫలితాలు/అనర్థాలను ఆయన వివరించారు. హిట్ అండ్ రన్ ఆక్సిడెంట్ కేసుల్లో మరణించిన వారికి రూ.2 లక్షల వరకు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 వేల వరకు ఆర్థిక సాయం లభిస్తుందని ఆయన తెలిపారు. ప్రమాదం జరిగిన 48 గంటల్లో సంబంధిత అన్ని శాఖలు i-RAD యాప్‌లో అప్లోడ్ చేయడం వల్ల ఇన్సూరెన్సు బాధితులకు తొందరగా చేకూరుతుందని చెప్పారు. వాహన తనిఖీల్లో ఇన్సూరెన్సు లేకుండా పట్టుబడితే రూ.2వేల వరకు అపరాధ రుసుము విధించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇన్సూరెన్సులేని వాహనం ప్రమాదాలు జరిగినప్పుడు విడుదల చేయడం జరగదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.సీతారాం, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.నారాయణరావు, సిబ్బంది, వాహన షోరూం డీలర్స్, ఇన్సురెన్సు సర్వేయర్లు, వాహన యునియన్ల సభ్యులు పాల్గొన్నారు.

పోర్టిఫైడ్ రైస్‌తో గర్భిణులకు ఆరోగ్యం

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వం అందిస్తున్న పోర్టిఫైడ్ రైస్‌తో గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని సిడిపిఒ జి.సుగుణ కుమారి అన్నారు. గురువారం స్థానిక సిడిపిఒ కార్యాలయంలో పోర్టిఫైడ్ రైస్ ద్వారా వివిధ రకాల వంటకాలు తయారు చేసి తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తమ ప్రాజెక్టు పరిధిలో ఎనీమియా, రక్తహీనతను నివారణ గుర్తించి పటిష్టంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలకు సిఎంఎఎం కార్యక్రమం, పిల్లల పెరుగుదల పర్యవేక్షణపై శిక్షణ ఇచ్చారు. విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు పి.అరుణ, ఆర్.లక్ష్మి, ఎల్.శారదమ్మ, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, అసోసియేట్ మౌలిక, పలువురు గర్భిణీలు, బాలింతలు, అంగన్వాడీ కార్యకర్తలు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి రక్ష

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలు ఆరోగ్యానికి కాపాడుకోవచ్చునని ఎన్ఎఫ్ఎ అన్నపూర్ణ అన్నారు. జియమ్మ వలస మండలం తుంబలిలో సీర గౌరునాయుడు, పూడి సీతారాం, డొల్లు చిన్నం నాయుడు, డొల్లు మోహన్ పొలంలో నువ్వుల్లో రబీ డ్రై షో యింగ్ పంటలు వేసే విధానంపై రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రధాన పంట నువ్వులతో పాటు గోంగూర, కొత్తిమీర, ముల్లంగి, తోటకూర ప్రకృతి వ్యవసాయ పంటలను పండించి ఇంటి అవసరాలకు వినియోగించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. 3మీటర్లకు ఒక లైన్ చొప్పున కట్టేజనుమ, కంది, ఆముదం, బెండ, చిక్కుడు పంటలు నువ్వులతో కలిపి వేసిన పంటలు మంచి దిగుబడి వస్తాయన్నారు. పై పంటలు ఖరీఫ్ నవధాన్యాలుగా ఉంటాయని, వేసవిలో భూమ్మీద సూర్యకాంతి నేరుగా పడకుండ కప్పబడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లక్ష్మణ్, జయలక్ష్మి, స్రవంతి, శ్యామల, నాగమణి తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఉమామహేశ్వరి

పీసా చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

పీసా చట్టంపై సర్పంచులకు, కార్యదర్శులకు, పీసా కమిటీ సభ్యులకు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పీసా చట్టంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సామర్లకోట నుంచి ఫెసిలిటేట్ మెంబర్ పి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని పీసా చట్టంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పీసా 2011 చట్టం ప్రకారం 7 రకాల పీసా విధులు, బాధ్యతలు ఉన్నాయని వాటిని పక్కాగా కమిటీ సభ్యులు, సర్పంచులు, అధికారులు గిరిజన ప్రాంతాల్లో అమలు జరిగేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో మండలంలో గల పీసా కమిటీ సభ్యులు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డును పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - సాలూరు

ఆంధ్రా - ఒడిశా సరిహద్దు ఘాట్ రోడ్డులో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా నేపథ్యంలో గురువారం ఎన్ హెచ్ డిఇ కె.సత్యభాస్కర్, ఎఇ రఘు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జెవి ఎస్ఎస్ఎస్ ప్రసాద్, పాచిపెంట ఎస్ఐ వెంకట సురేష్ ఘాట్ రోడ్డును పరిశీలించారు. ఘాట్ రోడ్డులో మలుపుల వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఇటీవల ఎఎస్పీ అంకిత సురానా అధికారులను ఆదేశించారు. దీంతో ఎన్‌హెచ్ డిఇ సత్యభాస్కర్, ఎంవిఐ ప్రసాద్, ఎస్ఐ వెంకట సురేష్ ఘాట్ రోడ్డును పరిశీలించారు.